www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 23 ఫిబ్రవరి 2023

5

తిరుపతి



కలెక్టరేట్‌లో నామినేషన్ల కోలాహలం

చిత్తూరుఅర్బన్: పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి నామినేషన్లు వేసేందుకు బుధవారం అభ్యర్థులు పెద్దసంఖ్యలో రావడంతో కలెక్టరేట్ కోలాహలంగా మారింది. ఉపాధ్యాయ ఎంఎల్‌సికి పిడిఎఫ్ తరపున బాబురెడ్డి, స్వతంత్ర అభ్యర్థులుగా ప్రవీణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డిలు నామినేషన్లు వేశారు. పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థులుగా పిడిఎఫ్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి, వైసిపి నుండీ శ్యాంప్రసాద్‌రెడ్డి, సునీతారెడ్డి, శ్రీకాంత్ టిడిపి, స్వతంత్ర అభ్యర్థులుగా జగదీష్, వీరభద్రాచారి, అంకయ్య చౌదరి, శివప్రసాద్‌రెడ్డి, కలిచర్ల సునీతలు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ హరినారాయణ్ వద్ద నామినేషన్ దాఖలు చేశారు.

అయ్యా...గొంతెండుతోంది....!

కిలోమీటరు నడిస్తేనే బిందె నీరు మరమ్మతుకు నోచుకోని బోర్లు



నిరుపయోగంగా బోరు

ప్రజాశక్తి - బాలాయపల్లి

ఎండలు మండుతున్నాయి.. వేసవి రాకముందే గొంతులు ఎండిపోతున్నాయి.. మండలంలోని మన్నారు గ్రామంలో కిలోమీటర్ దూరం నుంచి మంచినీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గ్రామంలో 320 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. నిత్యం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి కిలోమీటర్ దూరం నెత్తిన బిందెలు పెట్టుకని మహిళలు నీరు తెచ్చుకునే క'న్నీటి' కష్టాలు ఈ గ్రామంలో 'ప్రజాశక్తి'కి చిక్కాయి. మరమ్మతుకు గురైన బోర్లను అధికారులు పట్టించుకోకపోవడంతో తమకు తాగునీటి కష్టాలు తప్పడం లేదని మహిళలు వాపోతున్నారు. తాగునీటి ఎద్దడి సమస్య తన దృష్టికి రాలేదని ఎంపిడిఒ స్వరూపారాణి 'ప్రజాశక్తి'కి వివరణ ఇవ్వడం గమనార్హం.

అరుంధతి వాడ గ్రామ ప్రజలు గుక్కెడు నీటికోసం అల్లాడిపోతున్నారు. ఎండాకాలం రాకముందే గొంతెండుతుండడంతో తల్లడిల్లిపోతున్నారు. పాలకులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. నిత్యం ఒక్కొక్కరికి అన్ని అవసరాలు కలుపుకొని కనీసం 100 లీటర్ల నీరు అవసరం ఉంటుంది. కానీ సరిపడా నీరులేక ఇబ్బంది పడు తున్నారు. ఈ గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకు ఉంది. మిని మంచి నీటి పథకం ఉంది. అయితే ఓవర్ హెడ్ ట్యాంకు అలంకరణగా ఉంది. 2014 నుంచి ఆ ట్యాంకు నుంచి నీళ్ళు వచ్చిన దాఖ లాలు లేదు. అరందతి వాడలో ఉన్న బోరు మర మ్మతులకు గురై ఉంది. దీంతో సమస్య జఠిలంగా మారింది.

నెలరోజులుగా అవస్థలు : కొమ్మల లక్ష్మి


మంచినీటి పథకం మరమ్మతుకు గురై నెలరోజులయ్యింది. ఇంతవరకూ అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. చేతిబోరు మరమ్మతుకు గురయి ఏడాదయ్యింది. దీంతో తాగునీటికి ఏడాదినుంచి అవస్థలు పడుతున్నాం.

రూ.10 ఇచ్చి క్యాన్‌నీళ్లు కొంటున్నాం : మల్లారపు రేణుక

కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాళ్లం. మంచినీటి పథకం మరమ్మతుకు గురవడంతో ఒక్కో క్యాన్ 10 రూపాయలు ఇచ్చి కొనుక్కుంటున్నాం. ఈ కారణంగా ఒక్కో కుటుంబంపై నెలకు రూ.500-1000 భారం పడింది. తాగునీటికి అల్లాడుతున్నా పట్టించుకునేవారు లేరు.




సుదూర ప్రాంతాల నుంచి నీరు తెస్తున్న మహిళలు



మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి నామినేషన్ వేస్తూ...



ఉద్యోగ ఉపాధ్యాయ ప్రజాసంఘాల సంఘీభావం



బాబురెడ్డి నామినేషన్ వేస్తూ...

శాసనమండలిలో మీ 'గొంతుక' అవుతాం..!

మీ సమస్యలే.. మా అజెండా..!

- పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి నామినేషన్
- తరలొచ్చిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు
- సంఘీభావం ప్రకటించిన విఠపు, లక్ష్మణరావు
- చిత్తూరులో వేలాదిమందితో ర్యాలీ, సభ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

'నాలుగేళ్లుగా పిఆర్‌సి ఇవ్వలేదు, డిఎలు ఇవ్వలేదు కనీసం జీతాలు కూడా ఒకటో తేదీ వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.. ఆఖరుకు ఒక్క డిఎస్‌సి కూడా ప్రకటించలేదు.. ఏం మొహం పెట్టుకుని ఎంఎల్‌సి ఓటడిగేందుకు అధికార పార్టీ వస్తుంది.. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సమస్యలను శాసనమండలిలో వినిపిస్తాం.. మీ సమస్యలే మా అజెండా' అంటూ పిడిఎఫ్ అభ్యర్థులు పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సిలు విఠపు బాలసుబ్రమణ్యం, లక్ష్మణరావులు ఉద్ఘాటించారు. సూర్యుడు తూర్పున ఉదయిస్తాడనేది ఎంత వాస్తవమో, పిడిఎఫ్ అభ్యర్థుల విజయం అంతే వాస్తవమని అన్నారు. 'పదండి ముందుకు.. పదండి తోసుకు' అంటూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులు వేలాదిగా జిల్లాకేంద్రమైన చిత్తూరుకు తరలివచ్చారు.. పోరాటాల పీడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవాలనే ఆశయం వారి మోహాల్లో కనిపించింది. వారి రాకతో కట్టమంచి ప్రాంతం జనసంద్రమయ్యింది. తూర్పు రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎంఎల్‌సి స్థానానికి పోటీ చేసేందుకు పిడిఎఫ్ అభ్యర్థులు పి.బాబురెడ్డి, మీగడ వెంకటేశ్వరరెడ్డిలు బుధవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. తమ ఉద్యమ గొంతుకలను గెలిపించేందుకు ఉదయం ఎనిమిది గంటలకే ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. పిల్ల కాలువలన్నీ సముద్రంలో కలిసినట్లు చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి యుటిఎఫ్, ఎస్‌టియు, టిటిడి ఇతర ఉపాధ్యాయ, కార్మిక, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో జనం కదిలొచ్చారు. పదిన్నర గంటల ప్రాంతంలో ర్యాలీ ప్రారంభమయ్యింది. పిడిఎఫ్ ఎంఎల్‌సిలు విటపు బాలసుబ్రమణ్యం, లక్ష్మణరావు, యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్‌ఎస్. ప్రసాద్, సిఐటియు రాష్ట్ర నాయకులు కందారపు మురళి, ఎంఎల్‌సి అభ్యర్థులు మీగడ వెంకటేశ్వరరెడ్డి, పి. బాబురెడ్డి, ఎస్‌టియు రాష్ట్ర నాయకులు శ్రీదేవీ, ఎఐటియుసి నాయకులు రామానాయుడు, మురళిలు ప్రదర్శన ముందు భాగాన నడవగా మిగిలిన కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు వారి వెంట నడిచారు.



ఎంఎల్‌సి విఠపు



ఎంఎల్‌సి లక్ష్మణరావు

కట్టమంచి చెరువు నుంచి గాంధీవిగ్రహం వరకు దాదాపు రెండు కిలోమీటర్ల పొడవు ర్యాలీ ముందుకు సాగుతూ వెళ్లింది. ఈ సందర్భంగా లాంగ్ లీవ్ పిడిఎఫ్.. గెలవాలి.. గెలవాలి పిడిఎఫ్ అభ్యర్థులు గెలవాలి.. విజయం ఉద్యమ అభ్యర్థులదే అంటూ నినాదాలు చేశారు. ఈ ర్యాలీ హైరోడ్డు మీదుగా గాంధీవిగ్రహం, ఎంఎస్‌ఆర్ కూడలి మీదుగా నాగయ్య కళాక్షేత్రం వరకు సాగింది. అనంతరం అక్కడ బహిరంగ సభ జరిగింది. సభ మధ్యలో ఎంఎల్‌సి అభ్యర్థులు ఇరువురూ వెళ్లి కలెక్టరేటులో నామినేషన్లను దాఖలు చేశారు.

పిడిఎఫ్‌దే విజయం

గతంలో లాగే ఈ సారీ పిడిఎఫ్ అభ్యర్థులే ఈ తూర్పు రాయలసీమ ప్రాంతంలో విజయం సాధించనున్నారనని, ఇందులో ఎలాంటి సందేహం లేదని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. పీడీఎఫ్ ఎంఎల్‌సిల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా నాగయ్య కళాక్షేత్రంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మిక, విద్యార్థి, యువజన వేదిక ఆధ్వర్యంలో 'జాతీయ విద్యా విధానం.. రాష్ట్ర విద్యారంగంపై పరిణామాలు' అనే అంశంపై సదస్సు జరిగింది. జేవివి రాష్ట్ర అధ్యక్షులు మురళీధర్ అధ్యక్షత వహించారు. నాగయ్య కళాక్షేత్రంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు భారీ ఎత్తున కార్లతో ర్యాలీ నిర్వహిస్తే.. తాము జనం కాళ్లతో మట్టిపై ర్యాలీ నిర్వహించామని తెలిపారు. తమ నిరాడంబరతకు ఇదే నిదర్శనమని చెప్పారు. గతం కన్నా తమకు బలం పెరిగిందని, ఈ సారి భారీ ఎత్తున ప్రయివేటు ఉపాధ్యాయులు మద్ధతుగా నిలిచారని పేర్కొన్నారు. ఎంఎల్‌సి లక్ష్మణరావు మాట్లాడుతూ అధికార పార్టీ ఏకంగా శాసనమండలిని రద్దు చేస్తామని చెప్పి, ఇపుడు అభ్యర్థులను పోటీకి పెట్టడం వారి ద్వందరీతికి నిదర్శనమన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కందారపు మురళి మాట్లాడుతూ సూర్యుడు తూర్పున ఉదయిస్తాడనేది ఎంత వాస్తవమో, పిడిఎఫ్ అభ్యర్థుల విజయం కూడా అంతే వాస్తవమని తెలిపారు. పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మూడు జిల్లాలోని ఓటర్లను కలిసే శక్తి సామర్థ్యాలు ఒక్క పిడిఎఫ్ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు మద్దతు ఇస్తున్న ప్రజా సంఘాలకు మాత్రమే ఉందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ పోస్టుల భర్తీ, సిపిఎస్ రద్దు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల క్రమబద్దీకరణ కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి వందవాసి నాగరాజు, చిత్తూరు జిల్లా సిఐటియు నాయకులు వాడ గంగరాజు, అన్నమయ్య జిల్లా సిఐటియు నాయకులు శ్రీనివాసులు, చిత్తూరు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రన్, డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జయచంద్ర, ఐద్వా నాయకురాలు సాయి లక్ష్మి, యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యాదర్శి కెఎస్‌ఎస్ ప్రసాద్, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రఘుపతిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జివి రమణ, ఎఐటియుసి నాయకులు మురళి, నాగరాజు, రైతు సంఘం నాయకులు రామానాయుడు వివిధ ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ఉమ్మడి చిత్తూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జిల్లా కమిటిసభ్యులు, ఎస్‌టియు నాయకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సిపాయికి 'సై'..ఎస్సీవీకి 'నై'

వన్నెకుల ఓట్ల కోసం ఎమ్మెల్సీ ఎర..!!
మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీకి రిక్తహస్తం
శ్రీకాళహస్తిలో మారుతున్న రాజకీయాలు



సిపాయి సుబ్రమణ్యం



ఎస్సీవీ నాయుడు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రోజు రోజుకూ రాజకీయ సమీకరణలు మారిపోతున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన టీడీపీ, వైసీపీలు వచ్చే సాధారణ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నాయి. అందులో భాగంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అత్యధిక ఓటు శాతం ఉన్న వన్నె కుల క్షత్రియులే(పల్లె రెడ్లు) లక్ష్యంగా ఆ రెండు ప్రధాన పార్టీలు ముందుకెళ్తుండటం గమనించాల్సిన అంశం. ఈ క్రమంలో ప్రధాన ప్రతిపక్ష పార్టీ టీడీపీ ఓ అడుగు ముందుకేసి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత సత్రవాడ మునిరామయ్యకు వల వేసి విజయవంతమైంది. ఆ పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో సత్రవాడ మునిరామయ్యకు టీడీపీ కండువా కప్పి ఏకంగా శ్రీకాళహస్తి నియోజకవర్గ పెద్దన్న పోస్టును కట్టబెట్టింది. అదేవిధంగా సత్రవాడ కుమారుడు ప్రవీణ్ ను సైతం పార్టీలోకి ఆహ్వానించి సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఇది జరిగి గరిష్టంగా పది రోజులు గడవకముందే అధికార పార్టీ వైసీపీ ఏకంగా పది అడుగులు ముందుకేసి రష్ అధినేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, వన్నెకుల క్షత్రియ రాష్ట్ర నాయకుడు డాక్టర్ సిపాయి సుబ్రమణ్యంకు వల విసిరింది. ఆయన వైసీపీ లో చేరకుండానే స్థానిక సంస్థల(ఎమ్మెల్సీ)ఎన్నికల్లో స్థానం కల్పిస్తూ వైసీపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయంతో వన్నె రెడ్ల సామాజిక వర్గం సంబరాల్లో మునిగిపోతుండగా కమ్మ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీకి, ఆయన అనుచరగణానికి మింగుడుపడని అంశం. ఇదంతా రాజకీయ ఎత్తుగడలో భాగంగానే జరుగుతోందనీ, తన రాజకీయ లబ్ధి కోసం స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఎన్నో ఏళ్లగా పార్టీని అంటి పెట్టుకున్నవారినీ, సీనియర్లను సైతం విస్మరిస్తూ కొత్తగా పార్టీలో చేరుతున్న వారిని అందలమెక్కిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.


'ఎన్ని జరిగినా మౌనంగా ఎస్సీవీ'

మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీనాయుడుకు శ్రీకాళహస్తి, సత్యవేడు, వెంకటగిరి నియోజకవర్గాల్లో బలమైన పట్టుంది. 2019 ఎన్నికల్లో ఆ నియోజక వర్గాల్లో వైసీపీ గెలుపు బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకుని చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. అయితే ఎస్సీవీ జగన్ కు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా జగన్ ఎస్సీవీకి ఇచ్చిన హామీని మాత్రం పెడ చెవిన పెట్టినట్లుగా జరుగుతున్న పరిణామాలను చూస్తే అర్థమవుతోంది. దీంతో ఎస్సీవీ వర్గీయులు లోలోన రగిలి పోతున్నారు. అందుకు కారణం కూడా లేకపోలేదు. శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడుకు ఈ దఫా శాసనమండలిలో పదవి తప్పకుండా ఇస్తానని ఇటీవల రేణిగుంట విమానాశ్రయంలో సీఎం జగన్ ఎస్సీవీకి హామీ ఇచ్చారు. అయినా చివరకు ఎస్సీవీకి మొండి చెయ్యే చూపించారు

శాసనసభ ఎన్నికల తరువాత ఓ ప్రణాళిక ప్రకారం ఎస్సీవీ నాయుడు వర్గానికి క్రమేణా ప్రాధాన్యత తగ్గిస్తూ వచ్చారు. నియోజకవర్గంలో ఆయన చెప్పే పనులు ఏవీ జరగకుండా చేశారు. అయినా పెద్దాయన ఎక్కడా అసమ్మతి గళం విప్పలేదు. స్థానికంగా తనకు ప్రాధాన్యత ఇవ్వకపోయినా ఎంతో సహనం పాటిస్తూ వచ్చారు. ఇందుకు కారణం అధిష్టానం హామీ. మొదటి విడతలోనే ఎస్సీవీ నాయుడుకు శాసనమండలి పదవి ఇస్తారని అందరూ భావించారు. అయితే మొదటి విడతలో ఆయనకు పదవి దక్కలేదు. అయినా ఆయన పెదవి విప్పలేదు. మరో అవకాశం కోసం ఎదురు చూశారు. రెండవ దఫా తప్పకుండా ఎస్సీవీకి శాసనమండలి పదవి వస్తుందని ఆయన అనుచర వర్గం ఆశతో ఎదురు చూసింది. ఇంతలో ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి తిరుపతి రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యంను కొంతమంది అధికార పార్టీ నేతలు బరిలోకి తీసుకు వచ్చారు. ఆగమేఘాలపై తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేయించారు. వన్నెకుల క్షత్రియ కులానికి చెందిన ఓట్లు తిరుపతి జిల్లాలో వైసీపీకే గంపగుత్తగా పడతాయని చెప్పి సిపాయికి స్థానిక సంస్థల కోటాలో శాసనమండలి పదవి ఇచ్చారు. ఈ కారణంగా తిరుపతి జిల్లాకే చెందిన ఎస్సీవీనాయుడుకు ఈ పదవి దక్కలేదు. శాసనమండలిలో స్థానం కల్పించక పోవడం వైసీపీకి తీరని నష్టం కలుగుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అధిష్టాన నిర్ణయంతో ఎస్సీవీ నాయుడు మనస్థాపానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఎస్సీవీ ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇటీవల జనసేన పార్టీ ఎస్సీవీని సంప్రదించి తమ పార్టీ తరపున శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయాలని కోరినట్లు తెలిసింది. అదేవిధంగా సొంత పార్టీ టిడిపి ఎస్సీవీ రాక కోసం ఆత్రుతగా ఎదురుచూస్తోంది. కాదు ఏ పార్టీ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్గా పోటీ చేసే అవకాశం ఉందని చర్చించుకుంటున్నారు. ఈ క్రమంలో ఎస్సీవీ నాయుడు ఎలాంటి నిర్ణయం తీసుకోబోతారో వేచి చూడాల్సిందే మరి. ఏదిఏమైనా సత్రవాడ, సిపాయి కుల రాజకీయం మధ్య ఎస్సీవీ బలయ్యారని చర్చ నడుస్తోంది.

మోటార్లకు మీటర్లను పగలగొట్టండి

చక్కెర పరిశ్రమలకు పూర్వవైభవం తెస్తాం / యువగళం పాదయాత్రలో నారా లోకేష్



ఆశీర్వదిస్తున్న నైనారు పొన్నారావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే మొహమాటం లేకుండా పగులగొట్టాలని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ రైతులకు పిలుపునిచ్చారు. రైతు పక్షపాతి ప్రభుత్వామంటూ గొప్పలు చెప్పుకుంటున్న సీఎం జగన్ ఏటా రైతు తలపై రూ.2.50 లక్షల తలసరి అప్పును మోపుతున్నాడనీ, ఆ పాపం ఎవరిదని ధ్వజమెత్తారు. లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర 24వ రోజైన బుధవారం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని ఏర్పేడు మండలంలో కొనసాగింది. ఇందులో భాగంగా నారా లోకేష్ మడిబాక, మునగలపాలెం, వికతమాల, పాపానాయుడుపేట గ్రామాల రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతులు పలు సమస్యలను నారా లోకేష్ దష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తే రైతులకు ఉరి తప్పదన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ లేకుండా చేయాలనే దుర్బుద్ధితోనే జగన్ ప్రభుత్వం మోటార్లకు మీటర్లు బిగిస్తోందన్నారు. ఈ విధానాన్ని ప్రతి రైతూ వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ విషయంలో రైతులకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటుందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే మిల్లర్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.25కోట్లు బకాయి ఉందన్నారు. ఈ బకాయి చెల్లించక పోవడంతో మిల్లర్లు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయడానికి మొగ్గు చూపడం లేదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆరు చక్కెర పరిశ్రమలకు పూర్వ వైభవం తెస్తామని హామీ ఇచ్చిన జగన్, అధికారం చేపట్టాక ఐదింటిని మూయించారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో చెరకు రైతులకు రూ.63కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. ఈ చక్కెర పరిశ్రమలను శాశ్వతంగా మూతవేసి, ఆ భూములను అమ్మేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర వ్యాప్తంగా చక్కెర పరిశ్రమలకు పూర్వ వైభవం తెస్తామన్నారు. చక్కెర పరిశ్రమల వారు రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వడ్డీతో సహా చెల్లిస్తామని నారా లోకేష్ హామీ ఇచ్చారు. రైతులు వచ్చే సాధారణ ఎన్నికల్లో టిడిపి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం లోకేష్ రేణిగుంట మండలం జి పాలెం చేరుకుని అక్కడే రాత్రి బస చేశారు. మార్గమధ్యలో ఏర్పేడు మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ నైనారు పొన్నారావు లోకేష్ ను ఆశీర్వదించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి, శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ధనుంజయులనాయుడు, మునిక్రిష్ణమనాయుడు, మల్లిఖార్జునా యుడు, సత్రవాడ ప్రవీణ్, రవీంద్రనాథరెడ్డి, చెంచయ్యనాయుడు, ప్రకాశ్ నాయుడు, శివశంకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువగళంలో కరపత్రాల వివాదం

టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో కరపత్రాల వివాదం రాజుకుంది. లోకేష్ యాత్ర ఏర్పేడు మండలం మర్రిమందకు చేరగానే అక్కడి కొందరు వైసీపీ కార్యకర్తలు టీడీపీకి వ్యతిరేకంగా ముద్రించిన కరపత్రాలు వెదజల్లారు. దీంతో ఇరుపార్టీలకు చెందిన కార్యకర్తల మధ్య వివాదం జరిగింది. పోలీసులు వెంటనే జోక్యం చేసుకుని కరపత్రాలు వెదజల్లిన వైసీపీ కార్యకర్తలను సమీపంలోని పాఠశాల గదిలోకి తీసుకెళ్లి తాళాలు వేశారు. టీడీపీ కార్యకర్తలు అక్కడకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో వివాదం సద్దుమణిగింది. వైసీపీ వారు ఉద్దేశ్య పూర్వకంగా వివాదం సష్టించడానికి ఇలా చేశారని టీడీపీ నేతలు ఆరోపించారు.

బోయలను ఎస్టీలుగా గుర్తించాలి

ఏకసభ్య కమిషన్ ఎదుట నేతల వినతి / ఎస్టీ రిజర్వేషన్ శాతం పెంచాలని వాదన

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

బోయ, వాల్మీకి కులాలను రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో ఎస్టీలుగా గుర్తించారని, కేవలం రాయలసీమలో బీసీలుగా సర్టిఫికేట్లు ఇస్తున్నారని, ఒకే రాష్ట్రంలో రెండు వేర్వేరు సర్టిఫికేట్లు ఎలా చెల్లుతాయని బోయవాల్మీకి సంఘాల నాయకులు ఏకసభ్య కమిషన్‌కు విన్నవించారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఏక సభ్య కమిషన్ సమావేశం రిటైర్డ్ ఐఎఎస్ శామ్యూల్ ఆనంద్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. బోయ వాల్మీకి కులాలను షెడ్యూల్డ్ తరగతుల జాబితాలో చేర్చడానికి అధ్యయనం చేసేందుకు ఏకసభ్య కమిషన్ వచ్చిందన్నారు. ఇప్పటివరకూ రాయలసీమలోని ఆరు జిల్లాల్లో పర్యటించామని, ఏడో జిల్లాగా తిరుపతికి వచ్చామని తెలిపారు. ఎస్టీ సంఘ సభ్యులు, నాయకులు మాట్లాడుతూ ఇతర కులాలను జాబితాలో చేరిస్తే తమకు అన్యాయం జరుగుతుందని, ప్రస్తుతం ఉన్న ఎస్టీ రిజర్వేషన్ల సంఖ్య శాతాన్ని పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్సీ సాధికార సంస్థ అధికారి, గిరిజన సంక్షేమ అధికారి చెన్నయ్య, నాగరాజు, పాపయ్య, బాలయ్య, ఎస్టీ సంఘాల నాయకులు గుండాల నాయక్, కళావతి, మల్లేష్‌నాయక్, అక్కులప్పనాయక్ పాల్గొన్నారు.



మాయా లేదు.. మంత్రం లేదు

అంతా ఇంద్రజాలమే...!

'ఇంద్రజాల మాయలోడు' ఎమ్మెస్‌రెడ్డి
నేడు ప్రపంచ మ్యాజిక్ దినోత్సవం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

'మాయా లేదు... మంత్రం లేదు.. అంతా ఇంద్రజాలమే.. మూఢనమ్మకాలను నమ్మి జీవితాలను బలిచేసుకోవద్దు..' అంటూ ప్రజలను చైతన్యపరుస్తున్నారు ప్రముఖ ఇంద్రజాలికుడు ఎమ్మెస్ రెడ్డి.. ఫిబ్రవరి 23న పిసి సర్కార్ సీనియర్ జన్మదినం సందర్భంగా ఆ రోజును మెజీషియన్లు అందరూ కలిసి ప్రపంచ మ్యాజిక్ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీ. కొబ్బరికాయ నుంచి నీరుకు బదులు నెయ్యి తెప్పించడం, మూడు అడుగుల బారు కత్తిని కడుపులో గుచ్చుకోవడం, ఖాళీ చేతి గుడ్డల నుండి పావురాన్ని సష్టించడం, తల మీద మంట పెట్టి టీ కాయడం, ఖాళీ పేపర్నుంచి కూల్‌డ్రింక్ బాటిల్ బయటకు తీయడం, చిత్ర విచిత్రాలతోపాటు ప్రజల్లో నెలకొని ఉన్న ఇటువంటి మూఢ నమ్మకాలను తన మ్యాజిక్ ద్వారా చైతన్యవంతులు చేస్తున్నారు. ఎమ్మెస్‌రెడ్డి మాటల్లోనే..

గ్రామీణ ప్రాంతాల్లో ముసురుకున్న మూఢనమ్మకాలను భరతం పట్టే విధంగా మారుమూల గ్రామాల్లో సైతం ప్రదర్శనలిస్తుంటాం.. గతంలో పట్టణాలకు, మహానగరాలకే ప్రదర్శనలు పరిమితమయ్యేవి. ఏవో నాలుగు మాటలు ఉచ్ఛరించి చేతిలో విబూదిని తెప్పించి దైవసంభూతులుగా తమకు తామే ప్రకటించుకుని అమాయక ప్రజలను మోసం చేస్తున్న దొంగస్వాములకు ఇందద్రాల ప్రదర్శనలు విరుగుడు మంత్రాలవుతున్నాయి. దొంగస్వాముల ప్రదర్శనలు అన్నీ కేవలం జిమ్మిక్కులు, ట్రిక్కులు మాత్రమే. ఈ విషయాన్నే గ్రామీణ ప్రాంతాల్లో అమాయక ప్రజలకు అర్థమయ్యేలా చెబుతూ చైతన్యపరుస్తున్నాం. అరచేతిలో అద్భుతాలు సృష్టించి అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాం. అందుకే నన్ను 'ఇంద్రజాల మాయలోడు' అని నన్ను పిలుస్తారు. నా పూర్తి పేరు మండెం సుబ్రమణ్యం రెడ్డి. సూళ్లూరుపేట స్వస్థలం.

సూళ్లూరుపేటలోనే కాకుండా రాష్ట్రంలో 500కు పైగా ప్రదర్శనలు ఇచ్చి అప్పటి ముఖ్య మంత్రులు డాక్టర్ వైయస్.రాజశేఖర్ రెడ్డి, కొణిజేటి రోశయ్య, నారాచంద్రబాబు నాయుడు, ప్రముఖులు డాక్టర్ సి. నారాయణరెడ్డి, డాక్టర్ సమరం, వడ్డే.శోభనాదీశ్వరరావు, సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవి, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అక్కినేని నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్ ,ప్రముఖ సంగీత విద్వాంసులు మంగళం పల్లి బాలమురళీకష్ణలతో పాటు పలు ఇతర దేశస్తుల ప్రశంసలు అందుకొని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే ఉగాది పురస్కారమును రెండుసార్లు అందుకున్న ఏకైక మెజీషియన్‌ని. ఇటు ఆంధ్రప్రదేశ్ లోనే కాకుండా అటు తమిళనాడు, తెలంగాణ రాష్ట్రంలోనూ అనేక సన్మాన సత్కారాలు పొందాను. తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తిలో జన్మించి 20 సంవత్సరాలుగా సూళ్లూరుపేటలో నివాసం ఉంటున్నాను. 15 ఏళ్లుగా మ్యాజిక్ ప్రదర్శనలు ఇస్తున్నాను. బి.వి. పట్టాభిరామన్ ఏకలవ్య శిష్యుడిగా మ్యాజిక్ ట్రిక్కులు నేర్చుకున్నప్పటికీ ఇందులో మరింత పరిణితి చెందడానికి ఇక్కడ శ్రీహరికోట షార్ కాలనీలో నివాసముంటున్న మరో మెజీషియన్ సిఎం వేలు, రమణయ్య వద్ద కొంతకాలం శిష్యరికం చేసి ఎన్నో మెళుకువలు నేర్చుకున్నాను. ప్రదర్శనల ద్వారా సామాజిక చైతన్యం కల్పించడం నాకెంతో తృప్తినిస్తోంది.



సమాజంలో పాత్రికేయుల పాత్ర కీలకం



ప్రజాశక్తి-క్యాంపస్: కలానికి పదును, వేగం ఎక్కువన్నారు. సమాజానికి ఉపయోగపడే సమాచారాన్ని అందించడంలో పాత్రికేయులు ఎల్లప్పుడూ ముందుంటారని పర్యాటక, క్రీడల మంత్రి ఆర్ కె రోజా చెప్పారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం సెనెట్ హాల్లో తిరుపతి ప్రెస్ క్లబ్ 29వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సీనియర్ జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమ సభను ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్ రెడ్డి, బాలచంద్రల ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడల, పర్యాటక, యువజన, వ్యవహారాల శాఖ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ పత్రికలలో ప్రచురించే వార్తలలో నిజాయతీ, నిబద్ధత, విలువలతో కూడిన అంశాలపై నిజాయతీగా, నిర్భయంగా ప్రచురించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పత్రికా విలేకరులు అనుకుంటే ఒక వ్యక్తిని హీరోని చేస్తారని నువ్వెంత అంటే అదే వ్యక్తిని జీరో కూడా చేస్తారన్నారు. కత్తి కన్నా కలానికి పదును, వేగం ఎక్కువని కొనియాడారు.

విలువలతో కూడిన జర్నలిజాన్ని ప్రోత్సహించండి: భూమన
పాత తరం సీనియర్ జర్నలిస్టులు విలువలతో కూడిన అభ్యుదయ భావజాలాలతో పత్రిక రంగంలో వ్యాసాలను రాసేవారని, ప్రస్తుతం జర్నలిజంలో విలువలతో కూడిన వ్యాసాలు రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ గతంలో అభ్యుదయ భావాలు కలిగిన నాయకుల యొక్క సమాచారాన్ని సేకరించి వార్తలుగా ప్రచురించే వారిని తెలిపి ఎంతో విలువ ఉండేదని అన్నారు. ప్రస్తుతం రేటింగ్ కోసమో, మరే ఇతర విషయమో తెలీదు కానీ జర్నలిజంలో విలువలు తగ్గిపోయాయని సరైన ఖచ్చితమైన సమాచారాన్ని అందించడంలో కొంత ఖాళీ ఏర్పడిందన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్ అభివద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని వెల్లడించారు. కోవిడ్ సమయంలో తిరుపతి ప్రాంతంలో ప్రజల యొక్క అవస్థలను వెలికి తీయడంలో మీడియా మిత్రుల పాత్ర అభేద్యమైనది అన్నారు.

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కే. రాజారెడ్డి మాట్లాడుతూ ఎస్వీయూ సెనేట్ హాల్లో 29వ ప్రెస్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఎంతో ఆనందదాయకం అన్నారు. మీడియా మిత్రులు సమాజానికి నిజాయతీగా, నిబద్ధతగా చేయూతనిస్తూ ముందుకు నడిపించడంలో కీలక పాత్ర వహిస్తారన్నారు.

అది మా బాధ్యత ..: ప్రెస్ క్లబ్ సెక్రటరీ బాలచంద్ర మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్టులను సత్కరించడం మా బాధ్యతగా భావించామన్నారు. మా కమిటీ ఆధ్వర్యంలో తొలిసారి ప్రెస్ క్లబ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇకపై ప్రతి ఏటా ఆవిర్భావ దినోత్సవ వేడుకలను కొనసాగించేలా తీర్మానం చేస్తామన్నారు. ఎంతోమంది జర్నలిస్టులను ఏకతాటిపైకి తీసుకువచ్చే గొప్ప కార్యక్రమంగా నిలిచిందన్నారు. మా ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన సీనియర్ జర్నలిస్టులందరికీ కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్ కుమార్, విక్రమ్, జాయింట్ సెక్రటరీ దినేష్, ఈసీ మెంబర్లు మహేష్, శివయ్య, వసుంధర, వరప్రసాద రావు, సంజీవ సునీల్ , లావణ్య కుమార్, పరంధామ రెడ్డి, శ్రీనివాస్, బాలు, ఏ. సుదర్శన్ రెడ్డి, గౌస్ బాషా, సుధీర్, పత్రికా విలేకరులు పాల్గొన్నారు.

టీటీడీ అధికారుల బృందం పరిశీలన

ప్రజాశక్తి-క్యాంపస్: దేశీయ గోజాతుల అభివృద్ధి, డెయిరీ నిర్వహణపై మహారాష్ట్రలో క్షేత్రస్థాయి అధ్యయనం చేస్తున్న టీటీడీ అధికారుల బృందం బుధవారం బారామతిలోని ప్రఖ్యాత కృషి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించింది. టీటీడీ జేఈవో సదా భార్గవి నేతృత్వంలో చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, పశువైద్య విశ్వవిద్యాలయ విస్తరణ సంచాలకులు డాక్టర్ వెంకటనాయుడు బృందం మహారాష్ట్రలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బారామతిలోని ప్రఖ్యాత కృషి విజ్ఞాన కేంద్రంలో క్షేత్ర స్థాయి అధ్యయనం చేసింది. జన్యు ప్రక్రియ ద్వారా దేశీయ గోజాతులను పెద్ద ఎత్తున అభివృద్ధి చేస్తున్న విధానాన్ని క్షుణ్ణంగా ఈ బృందం పరిశీలించింది. దేశీయ గోజాతుల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, యాజమాన్య పద్ధతులు, స్వచ్ఛమైన పాల దిగుబడికి అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేసింది. ఇందుకు అవసరమయ్యే మౌలిక వసతులను టీటీడీ అధికారుల బృందం పరిశీలించింది.

రిసెప్షన్ సెంటర్ల భూమి పూజ

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: భాకరాపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోలీస్ స్టేషన్‌లలో రిసెప్షన్ సెంటర్ల నిర్మాణం చేపట్టేందుకు బుధవారం భాకరాపేట సర్పంచ్ సాకిరి భూపాల్ శంకుస్థాపన చేశారు. ఒక్కో సెంటర్‌కు రూ.12 లక్షలు, రెండు సెంటర్లకు రూ.24 లక్షలతో నిర్మాణాలను చేపట్టనున్నట్లు చెప్పారు. సర్పంచ్ భూపాల్, నాయకులు అర్జున్‌కుమార్, యంపిటిసి దాము తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై అవగాహన

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని కుక్కంబాకం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోదండరావ్ ఆధ్వర్యంలో ప్రజా ప్రగతి ట్రస్ట్ బుధవారం మొక్కల పెంపకంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా ప్రగతి ట్రస్ట్ కో-ఆర్డినేటర్ సుబ్రమణ్యం మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాలను భూమిపై వేస్తే కలుగు అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మినీ వాటర్ ట్యాంక్ వితరణ

ప్రజాశక్తి-సత్యవేడు: మండలంలోని మదనంబేడు జడ్పీ ఉన్నత పాఠశాలకు మాజీ గ్రామ సర్పంచ్ ఎత్తిరాజులు కుమారుడు రజనీకాంత్ సింటెక్స్ మినీ వాటర్ ట్యాంకును వితరణ చేశారు. దీని విలువ రూ.16 వేలు ఉంటుందని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు చినబాబు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న శరణ్య, దేవాన్షి నాట్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా సన్నిధివీధి దూర్జటి కళా ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఇందులో భాగంగా పట్టణానికి చెందిన మర్జెపల్లి శరణ్య, దేవాన్షిల భరతనాట్య ప్రదర్శన భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-గూడూరు: సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్‌లో తొలి స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి 176వ వర్ధంతి సందర్భంగా జిల్లా అధ్యక్షుడు శ్రీ రెడ్డి మధు రెడ్డి అధ్యక్షతన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ ఆంగ్లేయులపై తిరగబడ్డ తొలి భారత సింహం ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని తెలిపారు. సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్ర రీసెర్చ్ అసోసియేట్ డాక్టర్ టి.చైతన్య "పర్సనాలిటీ డెవలప్‌మెంట్"పై అవగాహన కార్యక్రమాన్ని మహిళా విశ్వవిద్యాలయంలోని నర్సింగ్ విద్యార్థులకు బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు యొక్క జీవన ప్రగతి, ఉద్యోగపరంగా అభివద్ధి చెందుటకు వారి వైఖరి, ప్రవర్తన, విశ్వాసం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు యుటిఎఫ్ నాయకుల మద్దతు



ప్రజాశక్తి-నాయుడుపేట: చిత్తూరులో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు నామినేషన్లు వేయనున్న పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా ఆదివారం తిరుపతి జిల్లా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె.శేఖర్, వారి బందం పాల్గొన్నారు. తూర్పు రాయలసీమ గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్ రెడ్డి మరియు టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పొక్కిరెడ్డి బాబు రెడ్డి నామినేషన్ సందర్భంగా తిరుపతి జిల్లా యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు కె.శేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.రామ్మూర్తి ఆధ్వర్యంలో నాయుడుపేట ప్రాంతీయ కార్యాలయం నుంచి నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి, మండలాల నుండి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు సుమారు 40 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'నేను ఎమ్మెల్సీ పదవికి కోట్లు చెల్లించానా?'

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తాను వెనకబడిన తరగతుల కుటుంబానికి చెందిన వాడినని గుర్తించి అట్టడుగు కులాలను అభివృద్ధి చేయడానికి సిఎం జగన్ మెహన్‌రెడ్డి కృషి చేస్తుంటే కోట్లుపెట్టి సీటు తెచ్చుకున్నానని నిరాధార ఆరోపణలతో అబాండాలు వేసే బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి కాణిపాకంలో సత్య ప్రమాణానికి సిద్ధమా అని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి సిపాయి సుబ్రమణ్యం బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లోని విలేకరుల సమావేశంలో సవాల్ విసిరారు.

లైంగిక వేధింపులపై పోరాడండి

ప్రజాశక్తి-క్యాంపస్: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకొని లైంగిక వేధింపులపై పోరాడాలని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కే రాజారెడ్డి పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'ఉన్నత విద్యా సంస్థలలో లైంగిక వేధింపులు నివారణ చట్టాలపై అవగాహన' అనే అంశంపై బుధవారం శ్రీనివాస ఆడిటోరియంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ లైంగిక వేధింపులు ఎక్కడ ఎదురైనా వెంటనే ఎదుర్కోడానికి విద్యార్థులు, యువత నడుం బిగించి పోరాడాలని పిలుపునిచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య ఓఎండి హుస్సేన్, అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ విమల కుమారి, సీనియర్ అడ్వకేట్ పర్సనాలిటీ డెవలప్మెంట్ ట్రైనింగ్ వక్త వాసు, సావిత్రమ్మ, పోలీస్ అధికారులు, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థినీలు పాల్గొన్నారు.

డబ్బు కోసం గుడిని అమ్మేస్తారా : జనసేన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: డబ్బు కోసం గుడిని, గుడిలో లింగాన్నీ అమ్మేస్తారా..!! అంటూ జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కోట వినుత ఆలయాధికారులపై మండిపడ్డారు. ఆలయంలో షూటింగ్‌ల పై నిషేధం ఉన్నా సింగర్ మంగ్లీకి అనుమతి ఎవరి వల్ల వచ్చిందంటూ ఆమె ప్రశ్నించారు. బుధవారం ఆమె పట్టణంలోని తన నివాస గహం వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. అధికార పార్టీకి శ్రీకాళహస్తి గుడి ఏటీఎం అయిపోయిందన్నారు. డబ్బులు ఇస్తే సంప్రదాయాలను, కట్టుబాట్లను మంటగలిపేలా షూటింగ్‌లు చేయిస్తారా..!! అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం వ్యక్తిగత యూట్యూబ్ చానెల్ కోసం సింగర్ మంగ్లీ గుడిని వాడుకుంటుందా అంటూ ప్రశ్నించారు. ఈ సంఘటన పై శ్రీకాళహస్తి ప్రజలు, శివయ్య భక్తులు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే ఆలయ ఈవో, ఎమ్మెల్యే , ఎండోమెంట్ కమిషనర్ ప్రజలకు క్షమాపణ తెలిపి, ఆ యూట్యూబ్ చానెల్ నుండి విడియోను తొలగించాలని డిమాండ్ చేశారు.


ప్రకృతి వైపరీత్యాల ముందస్తు అంచనా



ప్రజాశక్తి-క్యాంపస్: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, కేంద్ర చౌడు నేలల పరిశోధనా సంస్థ (ఐకార్) వారి ఆధ్వర్యంలో తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వేదికగా భారతీయ తీర ప్రాంత వ్యవసాయ పరిశోధన సంఘం "కోస్తా ప్రాంతంలో వ్యవసాయ పర్యావరణ స్థితిస్థాపకత పెంపు" అనే అంశంపై చేపట్టిన 4 రోజుల జాతీయ సదస్సు బుధవారం వెటర్నరీ వర్సిటీ ఆడిటోరియంలో ప్రారంభమైంది. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశం లో ముఖ్యఅతిథిగా తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యా లయ ఉపకులపతి డాక్టర్ వి.గీతాలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ గీతాలక్ష్మి మాట్లాడుతూ కోస్తా ప్రాంతాలు ప్రకతి వైపరీత్యాలకు తరచూ గురవుతుంటాయని, వాతావరణ మార్పులను ముందస్తుగా గుర్తించే శాస్త్ర, సాంకేతికత ద్వారా ప్రకతి వైపరీత్యాలను ముందస్తుగా అంచనా వేసి తగిన చర్యలు తీసుకునే వీలు కలుగుతుందన్నారు. . వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కోస్తా ప్రాంతంలో వ్యవసాయం, అనుబంధ పశుసంవర్ధకం, మత్స్య పరిశ్రమ, ఉద్యానపంటల సాగుకు ఆస్కారం ఉందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన సంచాలకులు డాక్టర్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని 26 జిల్లాల్లో 18 జిల్లాలు కోస్తా తీర ప్రాంతాలకు అనుబంధంగా ఉన్నట్లు తెలియజేశారు. పశువైద్య విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ వి. పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో ఉత్పత్తులు సాధించాల్సిన అవసరం ఉందన్నారు. పాలు, మాంసం, గుడ్లు, మత్స్య ఉత్పత్తులు పెంపుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం చేపట్టిన పరిశోధనలు, విస్తరణ కార్యక్రమాలు గురించి తెలియజెప్పారు. భారతీయ తీర ప్రాంత వ్యవసాయ పరిశోధన సంఘం జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన శాస్త్రవేత్తలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బెంగుళూరు ఇస్రో డైరెక్టర్ డాక్టర్ గౌరీశంకర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ సి.రమణ, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ప్రభాకరరెడ్డి, అధ్యాపకులు, కార్యనిర్వహణా కార్యదర్శిగా మత్తికా శాస్త్ర ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నాగమాధురి, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చీటి డబ్బు ఇవ్వలేదని వ్యాపారి ఆత్మహత్య





ప్రధాన అర్చకుడు

ప్రజాశక్తి - తిరుచానూరు
చేసిన పాపం పోగొట్టుకోడానికి, పుణ్యం మూటగట్టుకోడానికి భక్తులు దేవుని సన్నిధికి వస్తారు. అయితే దేవుని సన్నిధిలో ఉండే ఆలయ ప్రధాన అర్చకుడు సతీ సమేతంగా చీటీ డబ్బులు ఎగవేసి కోట్లాది రూపాయలు దండుకుని పరారైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో కీలక సూత్రధాని తిరుచానూరు అమ్మవారి ఆలయంలోని ప్రధాన అర్చకుడే నిందితుడు కావడం గమనార్హం. వివరాలిలా ఉన్నాయి.

చీటి డబ్బులు ఇవ్వకుండా ఏళ్ల తరబడి వేధిస్తున్న చీటి నిర్వాహకుని తీరుతో మనస్తాపం చెంది ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన తిరుచానూరు పంచాయతీ ఎస్వీపి కాలనీలో చోటు చేసుకుంది. తిరుచానూరు సిఐ కథనం మేరకు...తిరుచానూరు పంచాయతీ ఎస్వీపి కాలనీ కి చెందిన నితిన్ స్థానికంగా ప్రొవిజన్ దుకాణం నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తన అవసరాల నిమిత్తం ఇంటి పరిసరాల్లో నమ్మకంగా చీటిలు నిర్వహిస్తున్న వాణి, ఆమె భర్త ప్రతాప్ స్వామి అలియాస్ బాబు స్వామి(అమ్మవారి ఆలయం ప్రధాన అర్చకులు) వద్ద పెద్ద మొత్తంలో చీటీలు వేసాడు. చీటీ గడువు ముగిసి మూడేళ్లు గడుస్తున్నా తనకు రావాలిసిన డబ్బులు ఇవ్వకుండా దంపతులు ఇద్దరు రోజుకో మాట చెబుతుండేవారు. దీంతో అడిగి అడిగి విసిగి వేసారిన నితిన్ మనస్తాపం చెంది తన చావుకు కారణం చీటి నిర్వహిస్తున్న దంపతులే కారణమంటూ లేఖ రాసి ఆదివారం తన ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు సోమవారం తిరుచానూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు. నితిన్ చావుకు కారణమైన చీటి నిర్వాహకులు వాణి, ఆమె భర్త ఆలయ అర్చకులు బాబు స్వామి పై కేసు నమోదు చేశారు. నిందితులు ఇద్దరు ఇంటికి తాళం వేసి పరారీలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్త జంటలకు 'చెవిరెడ్డి' పెళ్లికానుక

ప్రజాశక్తి-క్యాంపస్: చంద్రగిరి నియోజకవర్గంలో కాబోయే వధూవరులకు స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి 'పెళ్లికానుక' అందిస్తున్నారు. గత ఏడాదికి పైగా ఎంతో మంది కొత్త జంటలకు కానుకను పంపి ఆశీస్సులు అందిస్తున్నారు. ఒక్కో జంటకు దాదాపు రూ.35 వేలతో బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, పట్టు వస్త్రాలు ఇస్తున్నారు. అలాగే శ్రీవారి ప్రసాదాలు, అమ్మవారి పసుపు కుంకుమ, గాజులు అక్షింతలను పంపుతున్నారు.

నారా లోకేష్‌కు మద్దతు తెలిపిన గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర కుప్పం నియోజకవర్గం నుంచి ప్రారంభించి ఇప్పటికి 24 రోజులు కావస్తున్నాయి. పాదయాత్రకు నగరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి గాలి భాను ప్రకాష్ బుధవారం మద్ద తు తెలిపి ఆయనతోపాటు పాదయాత్ర నిర్వహించారు.

12 ఎర్రచందనం దుంగల స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గూడూరు మండలం తీపనూరు-మేకనూరు అటవీ ప్రాంతం పరిధిలో ఏడుగురు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుండి 12 ఎర్రచందనం దుంగలను, ఎథియోస్ లివా కారు, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారు పుత్తూరు మండలం డి.సుబ్రమణ్యం (60), నగరి ఎస్.పళనివేలు (50), ఎంజీ శేఖర్ (42), గూడూరు మండలం నేలటూరు గోర్తల కష్ణయ్య (42), దేవిపాలెం సిద్ధపురెడ్డి ప్రసాద్ (26), మందడి మనోహర్ (57), వరదయ్యపాలెం సలవారి రవి (35)లుగా గుర్తించి అరెస్టు చేశామన్నారు. తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. వినోద్ కుమార్ బృందాన్ని ఎస్పీ చక్రవర్తి అభినందించారు.

విఎస్ఆర్ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్

ప్రజాశక్తి-గూడూరు: స్థానిక రెండవ పట్టణ పరిధిలోని విఎస్ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బాలకష్ణ రాజు మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు అనేక రకాల విషయాలపై అవగాహన కల్పించాలని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు.

స్కౌట్ అండ్ గైడ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్కౌట్ అండ్ గైడ్ సేవలు సమాజానికి ప్రశంసనీయమని పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ కెఎల్ ఎం ఎన్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ ఆలోచనా దినోత్సవం, స్కౌట్స్ ఉద్యమ స్థాపకుడు లార్డ్ స్టీఫెన్ స్మిత్ బడెన్ పావెల్ 166 వ జన్మ దినోత్సవం రోజున పుత్తూరు భారత్ స్కౌట్స్, గైడ్స్ తిరుపతి జిల్లా స్కౌట్ మాస్టర్ ఏ వెంకటేశ్వర్లు, జయదేవ్ పిడి హైస్కూల్ గేట్ పుత్తూరు, గైడ్ కెప్టెన్ రోజా ఆధ్వర్యంలో ముఖ్య అతిథిగా పుత్తూరు మున్సిపల్ కమిషనర్ మరియు అసిస్టెంట్ ఇంజినీర్ పాల్గొన్నారు.

మీ పిల్లలు బాగా చదువుతున్నారా..?

ప్రజాశక్తి - బిఎన్ కండ్రిగ
'ఏమ్మా.. పిల్లలు బాగా చదువుతున్నారా..? టీవీలకు, సీరియల్స్‌కు, జబర్దస్త్ కార్యక్రమాలకు దూరంగా ఉంచండి.. నెలరోజులు కష్టపడితే ఉత్తమ ఫలితాలు వస్తాయి.. మీ పిల్లల భవిష్యత్ బాగుంటుంది.. టెన్త్ మార్కులే విద్యార్థి భవిష్యత్‌కు గీటురాయి' అంటూ ఉపాధ్యాయులు రాత్రుల్లో నేరుగా విద్యార్థుల ఇళ్ల వద్దకే వెళుతున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్ల వద్దకు రాత్రిపూట సందర్శిస్తూ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి మంగళవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి, విద్యార్థుల దినచర్యలు తల్లిదండ్రులు భాగస్వాములు కావాలన్నారు. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తరువాత ఎలా చదువుతున్నారో తెలుసుకోడానికి ఆకస్మికంగా ఉపాధ్యాయులు పర్యవేక్షణ చేస్తూ మీ ఇళ్ల వద్దకే వస్తారని తెలిపారు. ఏప్రిల్‌లో జరగనున్న పబ్లిక్‌పరీఓల సన్నద్ధతలో భాగంగా విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి విద్యార్థి ప్రతిభను, సబ్జెక్టుల వారీగా సామర్థ్యాలను తెలుపుతూ ఈ నలభై రోజుల పాటు ఇంటిలో టీవీలను ఆపేసి పిల్లలకు చదువుకునే వాతావరణం కల్పించాలంటూ ప్రత్యేక శ్రద్ధ తీసుకునేలా కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు. తాజాగా జరిగిన నిర్మాణాత్మక మూల్యాంకనం పరీక్షలతో పాటు ప్రతిరోజూ జరుగుతున్న విజయసాధన పరీక్షల మార్కుల సామర్థ్యాలను తల్లిదండ్రులకు తెలిపారు. రాత్రి ఏడు గంటల నుంచి 9.30 గంటల వరకు సందర్శించనున్నట్లు తెలిపారు.

ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: బోయ, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చి గిరిజనుల పొట్ట కొట్టొద్దని తిరుపతి జిల్లా ఆర్డీవో కార్యాలయానికి వచ్చిన ఏకసభ్య కమిషన్‌ను యానాదుల సంక్షేమ సంఘం బందం జిల్లా ఛైర్మన్ చెంచయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లంపాటి వెంకటరమణ గిరిజనులకు జరి గే అన్యాయాలను వివరించి బుధవారం వినతిపత్రం సమ ర్పించారు. రాష్ట్ర కోశాధికారి కళావతి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వీఆర్వో మృతి

ప్రజాశక్తి-ఓజిలి: మండలంలోని పున్నేపల్లి పంచాయతీ వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న కాపులూరు యోహాన్ (51) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. షుగర్, బిపి వ్యాధులతో బాధపడుతున్న ఆయన్ను కుటుంబ సభ్యులు చెన్నైకి తరలించారు. వైద్యులు ఆయన్ను ఐసియులో ఉంచి వైద్య చికిత్సలు అందించారు. ఆరోగ్యం కుదుటపడటంతో ఐసీయూ నుండి జనరల్ వార్డుకు షిఫ్ట్ చేశారు. ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉన్న ఆయనకు బుధవారం సుమారు 10 గంటలకు గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు.

డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని పురపాలక సంఘం కాపు వీధిలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ పనులు వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ కె ఎల్ ఎం రెడ్డి బుధవారం పేర్కొన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో బాలింతలకు, పిల్లలకు ఇచ్చే పౌష్టిక ఆహారాన్ని పరిశీలించారు. పట్టణంలోని మునిసిపల్ పార్కులో మొక్కలకు ఎండాకాలం రావడంతో రోజూ నీరు అందించాలని, అలాగే పార్కుని పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి ఆదేశాలు జారీచేశారు.

టీడీపీలో చేరిన బీజేపీ నాయకులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక బీజేపీ నాయకులు కొందరు బుధవారం టీడీపీలో చేరారు. నారా లోకేష్ పాదయాత్ర సందర్భంగా దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి సభ్యుడు కోనేటి సిద్ధులయ్య, మైనారిటీ నాయకుడు షేక్ రియాజ్ లు టీడీపీలో చేరారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో వీరు టీడీపీలో చేరగా లోకేష్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

'షమ్రిత'కు శివనంది అవార్డు

ప్రజాశక్తి-గూడూరు రూరల్: స్థానిక తిలక్ నగర్ ప్రాంతానికి చెందిన ఉడతా షమ్రిత యాదవ్‌కు భరత నాట్య విభాగంలో శివనంది అవార్డు దక్కింది. కర్ణాటక రాష్ట్రం హాస్పేట(హంపి)లో ఈనెల 18,19,20వ తేదీలలో మహా శివరాత్రి సందర్భంగా సిటిజన్ వెల్ఫేర్ ఫోరం, ప్రైడ్ ఇండియా కల్చరల్ ఆధ్వర్యంలో జాతీయ నత్య సంబరాలు జరిగాయి. ఈ సందర్భంగా గూడూరు సంస్కృతి సమ్మేళనం, పొన్నలూరు వీర రాఘవరెడ్డి సంగీత, నత్య పాఠశాల, శివ లలిత భరత నాట్య కళాక్షేత్రం ప్రిన్సిపల్ పిండి మల్లిక ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న షమ్రిత యాదవ్‌కు శివనంది అవార్డును నిర్వాహకులు ప్రకటించారు. శ్రీ క ష్ణ దే వ రా య ం ల వంశస్తురాలు లలిత రాణీ అవార్డు, ధ్రువీకరణ పత్రం, మెడల్‌ను ప్రదానం చేశారు షమ్రిత యాదవ్‌కు శివనంది అవార్డు దక్కడంపై పలువురు క ళా బి. వ రా న ం ల ం అభినందనలు తెలిపినట్లు తల్లిదండ్రులు తెలిపారు.

యుటిఎఫ్ నూతన కమిటీ నియామకం



ప్రజాశక్తి-బాలాయపల్లి : మండల కేంద్రంలో మండల నూతన కమిటీ బుధవారం జరిగింది. ఈసందర్భంగా గౌరవ అధ్యక్షులు పి.ఫిరోజ్ ఖాన్, అధ్యక్షుడు ఎం.చలపతి, అసిసోయేట్ అధ్యక్షుడు సి.గంగరాజు, పి.మాధవిలత, ప్రధాన కార్యదర్శి సాకి శ్రీహరి, కోశాధికారి ఎం రామ్ ప్రసాద్ లను నియమించారు. ఈ కమీటి జిల్లా యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు ఎస్ మురళీ కష్ణ, జి. రాజశేఖర్, బి. దేవసేన పాల్గొన్నారు.

శిక్షణకు అర్హుల ఎంపిక

ప్రజాశక్తి-సత్యవేడు: స్థానిక శ్రీసిటీ నైపుణ్యాభివద్ధి కళాశాలలో స్కిల్ నైపుణ్య కోర్సుల్లో ఉచిత శిక్షణకు ఈనెల 24వ తేదీన అర్హుల ఎంపిక జరుగుతుందని స్థానిక ఎంపీడీవో బాల గణేష్ పేర్కొన్నారు. జిల్లా నైపుణ్య అభివద్ధి సంస్థ, సీడప్ సంయుక్తంగా నిర్వహించనున్న శిక్షణ కోర్సుల్లో అర్హులైన వారిని ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించి ఈనెల 24వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జిల్లా నైపుణ్యాభివద్ధి సంస్థ అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆయన చెప్పారు. ఆసక్తి ఉన్న డిప్లమో, బీటెక్ చదువుకున్న యువతీ, యువకులు అర్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని ఆయన కోరారు.

పాస్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని లక్ష్మీపురం గిరిజన కాలనీలోని సిఎంఎస్ఐ క్రీస్తు సంఘం పాస్టరుగా పనిచేస్తున్న ప్రేం కుమార్ బుధవారం ఉదయం మృతి చెందారు. ఆయన అంత్యక్రియలకు మండలంలోని పిడబ్ల్యుసి ఆర్‌పిఎ పాస్టర్ల అసోసియేషన్ రూ.5 వేలు అందించారు. పి.డబ్ల్యు.సి.ఆర్.పి.ఎ ప్రెసిడెంటు టి.జాన్ పీటర్, సెక్రటరి సురేష్ బాబు, ట్రెజరర్ ఎస్.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-దొరవారి సత్రం: స్థానిక పిహెచ్‌సి పరిధిలోని తుంగమడుగు గ్రామంలో బుధవారం వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు కంటి చూపు పరీక్షలు నిర్వహించారు. ఆప్తమాలజిస్ట్ లలిత్ కుమార్ చూపుకు సంబంధించిన లోపాలు కంటిలో పొరలు, దూరపు వస్తువులు కనిపించకపోవడం, దగ్గర వాటిని సరిగా చూడలేకపోవడం వంటి పరీక్షలు నిర్వహించి వారికి అద్దాలు సరఫరా చేసేందుకు వివరాలు నమోదు చేశారు. సచివాలయం ఏఎన్ఎం అమరావతి తదితరులు పాల్గొన్నారు.

కష్టపడే వారికి ప్రాధాన్యత ఉంటుంది

ప్రజాశక్తి-గూడూరు: పార్టీకోసం కష్టపడిన వారందరికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సముచిత స్థానం కల్పిస్తున్నారని భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఇవన్నీ ఇలాగే కొనసాగాలంటే మళ్ళీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలందరూ ఆశీర్వదించాలని స్థానిక సంస్థల వైసిపి ఎమ్మెల్సీ అభ్యర్థి మురళి వెల్లడించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైసిపి మురళిని ఎంపిక చేసింది. ఆయన్ను నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంగళం అటవీ ప్రాంతంలో మంటలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వేసవికాలం పూర్తిస్థాయిలో సమీపించక ముందే అటవీ ప్రాంతంలో మంటలు ఏర్పడి హెక్టార్ల అడవి కాలిపోతోంది. ఈ ప్రాంతంలో మంటలు ఏర్పడడానికి కారణంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలుగు గంగ నీటి శుద్ధి కేంద్రం పక్కనున్న అడవి మార్గంలోకి కొంతమంది యువకులు రాత్రి వేళల్లో వెళ్లి గంజాయి సేవిస్తున్నారని స్థానికంగా ఉన్న సమాచారం. ఈ క్రమంలోనే మంటలు ఏర్పడ్డాయా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. యువకులు బహిర్భూమి పేరుతో అడవిలోకి వెళ్లి వస్తూ ఈ దుర్ఘటనకు పాల్పడ్డారా అనే అనుమానాలు రేకెత్తిస్తున్నాయి.